ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 38.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
మంగళవారం 8 ఏప్రిల్ 2025



మరో ప్రపంచం.. మరో ప్రపంచం పిలిచింది..



ఒక్కో రీల్‌కు ఒక్కో ముద్ద.. సరేనా..?


సెల్లు మామ రావే..!

కంటితో ఇంపును.. నాసికతో ఘుమఘుమలను..
ఆస్వాదించగానే.. నోట్లో నీళ్లూరాలి..!
ఆత్రంగా కలుపుకున్న అన్నం ముద్ద రుచిని..
నాలుకకు చూపించి.. నమిలి మింగితే ఆకలి తీరాలి...!
అప్పుడే అద్భుతంగా జీర్ణమవుతుంది..!
శరీరానికి కావాల్సిన శక్తి సమకూరుతుంది..!
ఇది ఆరోగ్య రహస్యం..! స్మార్ట్ ఫోన్..
అన్నింటితోపాటు అన్నాన్నీ మింగేసింది..! ప్చ్..!
ఆహారం తీసుకోవడమంటే..
శరీరానికి చార్జింగ్ పెట్టుకోవడం కాదు కదా..!
అమ్మ సైతం.. చందమామను మరిచి..
సెల్లు చూపిస్తూ ముద్దలు పెట్టే పరిస్థితి..!

(అనంతపురం నగరంలోని వివిధ ప్రాంతాలలో..)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి







అయ్యో.. ఎంతపని జరిగిందీ..!

రూ.13 కోట్లతో రోడ్ల అభివృద్ధి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం/ ఉరవకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.13 కోట్ల నాబార్డు నిధులు మంజూరయ్యాయని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురంలోని తన నివాసంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉరవకొండ మార్కెట్ యార్డు నుంచి కణేకల్లు రోడ్డు వయా వెలగొండ రోడ్డు, ఉరవకొండ టౌన్ పరిధిలో 3 కిలోమీటర్ల రహదారికి రూ.4 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలోని గుండ్లపల్లి క్రాస్ నుంచి గోళ్ల వయా బెళుగుప్ప, వెంకటాద్రిపల్లి రోడ్డు దాదాపు 20.30 కిలో మీటర్ల రహదారికి రూ.6 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. విడపనకల్లు నుంచి గడేకల్లు వరకు 8.40కిలో మీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి పయ్యావుల స్పష్టం చేశారు.

కమ్యూనిటీ భవనాలకు రూ.3.2 కోట్లు

ఉరవకొండలో వివిధ కమ్యూనిటీ భవనాలకు రూ.3.2కోట్లు నిధులు మంజూరు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. వాల్మీకి, కురుబ కమ్యూనిటీ కల్యాణ మండపాం అభివృద్ధికి రూ.కోటి, కృష్ణదేవరాయ బలిజ సంఘం కమ్యూనిటీ భవనానికి రూ.20లక్షలు, షాదీఖానా, యాదవ కమ్యూనిటీ, భద్రావతి భావన రుషీంద్రుల కమ్యూనిటీ భవనాల అభివృద్ధికి రూ.95లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ కమ్యూనిటీ, నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనానికి రూ.55లక్షలు, కార్పెంటర్‌ల వర్క్ షెడ్‌కు రూ.25లక్షలు, నియోజకవర్గంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.25లక్షలు మంజూరయ్యాయని తెలిపారు.

మంత్రికి సమస్యలపై వినతులు

హంద్రీనీవా కాలువ వెడల్పు పనుల పరిశీలనకు విచ్చేసిన మంత్రికి లత్తవరం గ్రామస్థులు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. హంద్రీనీవా పిల్లకాలువలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పెండింగ్‌లో ఉందని మంత్రికి విన్నవించారు. ముష్టూరు-లత్తవరం గ్రామాల వద్ద బీటీ రోడ్డు నిర్మించాలని కోరారు. హంద్రీనీవా కాలువ వెడల్పు వలన ఇరువైపుల ఉన్న సాగు భూమిని సర్వే చేసి, సరిహద్దు రాళ్లు నాటాలని మంత్రిని కోరారు. హంద్రీనీవా పిల్లకాలువ కింద భూములు కోల్పోయిన రైతులకు పరిహారం మంజూరు చేయించినందుకు లత్తవరం గ్రామస్థులు మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోవిందు, బళ్లారి మల్లి, ఓబన్న, పాలడుగు గోపాల్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- జిల్లాస్థాయి గ్రీవెన్స్‌కు 492 ఫిర్యాదులు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీ పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బాధితులు తరలివచ్చి అర్జీలు ఇచ్చారు. మొత్తం 492అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. జేసీ శివనారాయణశర్మ, డీఆర్‌ఓ మలోల తదితరులు అర్జీలు స్వీకరిం చారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టరు మాట్లాడుతూ ప్రతిశాఖ ఉన్నతాధికారులు అర్జీల పరిష్కార విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బాధితులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని అపుడే మనపట్ల గౌరవం పెరుగుతుందన్నారు.

● కలెక్టర్‌తో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నేతల వాగ్వాదం

గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టరుతో ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు వాగ్వాదానికి దిగారు. జేఏసీ నాయకుడు సాకే హరి తమవారితో కలిసి గ్రీవెన్స్‌కు వచ్చారు. కలెక్టరును కలిసి ఆత్మకూరు మండలంలో భూ సమస్యపై మాట్లాడుతూ ఎన్నిసార్లు వచ్చి అర్జీలు ఇచ్చినా పట్టించుకో వడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అర్జీలు ఇవ్వడానికి వస్తే చెకింగ్ చేసి పంపిస్తున్నారని, మళ్లీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు రమ్మని పిలుస్తారు ఇదేనా న్యాయం అంటూ వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం చేసుకొని వారిని పంపించగా సమస్య సద్దుమణిగింది.

నేడు విడపనకల్లులో ప్రత్యేక గ్రీవెన్స్

విడపనకల్లులో మంగళవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పయ్యావుల కేశవ్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వినతుల స్వీకరిస్తారని, అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.

ఏమిటీ అలసత్వం..?

కార్పొరేషన్‌పై బకాయిల బండ - ఆస్తి పన్ను బకాయి రూ.28 కోట్లు

- పోలీస్ శాఖ నుంచే రూ.7 కోట్లు
- కో ఆపరేటివ్ స్టోర్స్ రూ.51లక్షలు
- మరికొన్ని రూ.10లక్షల నుంచి రూ.30 లక్షల వరకు..
- బడాబాబులకు అధికార, పాలకవర్గ నేతల అండ
- వడ్డీపై 50 శాతం రాయితీ కల్పించినా నిర్లక్ష్యం



అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. సంస్థకు ప్రధాన వనరుగా ఉన్న పన్ను బకాయిల వసూళ్లలో అలసత్వం తాండవిస్తోంది. వందలు.. వేలు దాటి రూ.లక్షల్లో బకాయిలు ఉన్నాయి. ఇందులో కొన్ని వ్యాపార సంస్థలు ఉండగా...మరికొన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. కార్పొరేషన్‌లో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. నగర పరిధిలో నివాసముంటున్న ప్రతి ఒక్కరూ కార్పొరేషన్‌కు ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఆస్తిపన్ను ఆరునెలలకోసారి చెల్లించాలి. బకాయిల విషయంలో ఈ ఏడాది కమిషనర్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు గట్టిగా పట్టుబట్టారు. పన్ను చెల్లించని వారికి నీటి కొళాయి కనెక్షన్లు కట్ చేస్తామని హెచ్చరికలు చేసి.. అన్నంత పని చేశారు. కానీ రూ.లక్షల్లో బకాయిలు ఉన్న కొన్ని సంస్థలు, వ్యాపారులు మాత్రం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. కార్పొరేషన్‌కు రూ.28 కోట్ల వరకు బకాయి ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పన్ను చెల్లించకుండా కొందరు రాజకీయ నాయకులతో ఒత్తిళ్లు తెచ్చారు. ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా వారిలో మార్పు రాలేదు.

కో ఆపరేటివ్ స్టోర్స్ రూ.51 లక్షలు...

నగరంలో అత్యధిక బకాయిలు ఉన్న మరో ప్రభుత్వ విభాగానికి చెందినది డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సొసైటీ. ఈ సంస్థ నుంచి కూడా కార్పొరేషన్‌కు పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. సుదీర్ఘకాలం పన్ను చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఆ సంస్థ నుంచి రూ.51లక్షల పన్ను బకాయి రావాల్సి ఉంది. ఈ సంస్థకు కూడా అధికారులు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పట్టించుకోలేదని సమాచారం.

పోలీస్ శాఖ నుంచే రూ.7కోట్లు...



జిల్లా పోలీస్ శాఖ నుంచే కార్పొరేషన్‌కు అత్యధికంగా రూ.7కోట్లకు పైనే బకాయిలు ఉన్నాయి. పన్ను చెల్లించడంలో ఆ శాఖ అలసత్వం ప్రదర్శిస్తోంది. కమలానగర్ పరిధిలో ఉన్న పోలీస్ కాంప్లెక్స్‌తో పాటు జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుంచి బకాయిలు ఉన్నాయి. 32 సంవత్సరాల నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. 1991 నుంచి పన్నులు వేస్తుండగా.. తొలి రెండు సంవత్సరాలు మాత్రమే చెల్లించారట. 1993 నుంచి ఆస్తి పన్ను చెల్లించ లేదు. పోలీస్ కాంప్లెక్స్‌లో ప్రతి దుకాణానికి రూ.లక్షల్లో అడ్వాన్సులు ఉంటాయి. వాణిజ్య ప్రాంతం కావడంలో దుకాణాల అద్దె కూడా రూ.వేలల్లోనే ఉంటుంది. వాటి పరిధిలోనే దాదాపు 150 ఆస్తుల నుంచి పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా దుకాణాలు, ఫంక్షన్‌హాల్ నుంచి పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుంది. కానీ పన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సముదాయం మరింత పెద్దది. మొత్తం బకాయి రూ.7కోట్ల పైగానే ఉందని సమాచారం. కొన్ని సందర్భాల్లో కార్పొరేషన్ అధికారులు అడగడం... పోలీస్ అధికారులు ప్రభుత్వానికి ఫైల్ పంపుతామనడంతోనే సరిపెడుతున్నారు.

బడాబాబులకు పెద్దల అండ

కార్పొరేషన్ పరిధిలో కొన్ని సంస్థలు, వ్యాపార సముదాయాల నుంచి పెద్ద మొత్తంలో బకాయిలు ఉన్నాయి. రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బకాయిలు ఉన్నవి లెక్కలేనన్ని. రూ.10 లక్షలకుపైగా రూ.30లక్షల వరకు కూడా చాలా ఉన్నాయి. వాటికి అధికారపార్టీ నేతలు, పాలకవర్గ పెద్దలు అండగా ఉన్నారని సమాచారం. దీంతో వారు కట్టేదే లేదు.. ఏం చేసుకుంటారో చేసుకోండన్నట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. నగరంలోని జడ్పీ ఎదుట గీతామందిరం పక్కనున్న క్రిష్ణ ఫంక్షన్‌హాల్ నుంచి రూ.21 లక్షల బకాయి ఉంది. వారికి అధికారపార్టీ నేత, పాలకవర్గంలోని కీలకనేత మద్దతుగా నిలిచారని సమాచారం. కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయం నుంచి రూ.14 లక్షలు, క్రిష్ణకళామందిరం నుంచి రూ.28 లక్షలు రావాల్సి ఉంది. వారికి ఫంక్షన్‌హాల్ రూపంలోనూ, దుకాణాల నుంచి ప్రతి నెలా అద్దెడబ్బులు వస్తుంటాయి. కానీ కార్పొరేషన్‌కు బకాయిలు చెల్లించడం లేదు. సప్తగిరి సర్కిల్‌లోని జోయాలుక్కాస్, మలబార్ అండ్ గోల్డ్ వ్యాపార సంస్థలు నిర్వహిస్తున్న వ్యాపార సముదాయం నుంచి రూ.30 లక్షల బకాయి ఉంది. 50 శాతం రాయితీ ఇచ్చినా వారు చెల్లించలేదు. పీస్ మెమోరియల్ హాల్ నుంచి సైతం రూ.లక్షల్లో పెండింగ్ ఉన్నట్లు తెలిసింది. శ్రీకంఠం సమీపంలోని మంజీరా లాడ్జికి సంబంధించిన రూ.18లక్షల బకాయి ఉంది. అధికారులు పన్నులు చెల్లించాలని కోరితే... తమ మధ్య విభేదాలున్నాయని, సమస్యలు తెగితే చెల్లిస్తామని సెలవిచ్చారట. రాణినగర్‌లోని జాగూర్ టైల్స్ దుకాణం సంబంధించి భవనం నుంచి రూ.21లక్షల పన్ను బకాయి ఉంది. దీనికి పాలకవర్గంలోని ఓ కీలక నేత మద్దతిచ్చినట్లు సమాచారం. ఇలా రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల లోపు బకాయిలున్న చాలా వాటికి అధికారపార్టీ, పాలకవర్గ నేతలు పూర్తి మద్దతుగా ఉన్నారని తెలుస్తోంది. దీంతో అధికారులు ...ఇదెక్కడి తలనొప్పి అంటూ ఇచ్చిన వారి నుంచి పన్ను వసూలు చేస్తున్నారు.

బకాయిలు ఉన్నాయి..



కార్పొరేషన్ పరిధిలో పన్ను బకాయిలు ఉన్న ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ వ్యాపార సంస్థలకు తెలియజేశాం. పోలీస్ శాఖ పరిధిలో పోలీస్ కాంప్లెక్స్ సహా ఇతరత్రా రూ.7కోట్లకు పైగా బకాయి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రైవేట్ వ్యాపార సముదాయాలకు బకాయిలు చెల్లించాలని స్పష్టంగా చెప్పాం. ప్రభుత్వం వడ్డీపై 50 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాల్సింది. ఎప్పుడూ లేని విధంగా ఈసారి రూ.42 కోట్లు వసూలు చేశాం. వడ్డీతో కలిపి రూ.28 కోట్ల వరకు పెండింగ్‌లో ఉంది. పెండింగ్‌లో ఉన్న వాటిపై మరింత దృష్టి సారిస్తాం.

-వెంకటేశ్వర్లు, డిప్యూటీ కమిషనర్

తల్లి, చెల్లికి న్యాయం చేయని జగన్

- కార్యకర్తలకు ఏం చేస్తాడు..?
- అడ్డుకోవడం మాకు పెద్ద పనికాదు
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్



బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తల్లి, చెల్లికి న్యాయం చేయనివాడు... కార్యకర్తలకు ఏం చేస్తాడని మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మండిపడ్డారు. ఆయన సోమవారం టీడీపీ అర్బన్ కార్యాలయంలో 18 మందికి రూ.20 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జగన్ పాపిరెడ్డి పల్లి పర్యటనపై తీవ్రస్థాయిలో స్పందించారు. పాపిరెడ్డిపల్లిలో క్షణికావేశంలో జరిగిన సంఘటనను వైసీపీ నాయకులు రాజకీయ హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

'మీ బాబాయ్‌ని హత్య చేయించి, ఆత్మహత్యగా చిత్రీకరించారని, మీ చెల్లెలు న్యాయం కోసం పోరాడుతోందని ముందుగా ఆమెకు న్యాయం చేయాల'ని సూచించారు. 'మిమ్మల్ని అడ్డుకోవాలంటే మాకు పెద్ద పని కాదని... ఈ మాట ఇప్పటికే ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పార'న్నారు. ఆ సంస్కృతి తమది కాదన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా, లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించి వెళ్లాలన్నారు. గతంలో తోపుదుర్తి మహేశ్వరరెడ్డి అనే వైసీపీ కార్యకర్తను రైలు పట్టాలపై వేసి చంపారని, మరి ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నిం చారు. మీ ప్రభుత్వ హయాంలో అనేక మందిని హత్య చేశారని, ఆయా కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదో జగన్ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. హత్యా రాజకీయాలు చేయడం మొదటి నుంచి జగన్‌కు అలవాటన్నారు.

నేడు జగన్ రాక



7

రెచ్చగొట్టకు.. చిచ్చు పెట్టకు..!

- బాధితులకు సాయం చేసి వెళ్లు..
- జగన్‌కు పరిటాల సునీత సూచన

7

రంగనాథుడికి పట్టు వస్త్రాలు

తాడిపత్రి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలూరు కోన రంగనాథస్వామికి ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



రంగనాథ స్వామికి పట్టు వస్త్రాలను తీసుకు వెళుతున్న ఎమ్మెల్యే

పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులు

● జిల్లాలో 13,276 మంది హృద్రోగులు ● సీఎం సమీక్షలో గణాంకాల వెల్లడి

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు సోమవారం నిర్వహించిన సమీక్షలో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. దీర్ఘకాలిక వ్యాధులు, చికిత్స, నివారణ చర్యల గురించి వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో జిల్లాల వారీగా రోగులు, రోగాల గణాంకాలను, ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స పొందుతున్నవారి వివరాలను అధికారులు వివరించారు. జిల్లాలో గుండె జబ్బు బాధితులు 13,276 మంది ఉన్నట్లు గుర్తించారు. హృద్రోగుల పరంగా జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉంది. కిడ్నీ బాధితులు జిల్లాలో 7,573 మంది ఉన్నారు. జిల్లా ఎనిమిదో స్థానంలో ఉంది. అదే విధంగా 4,287 మంది క్యాన్సర్ బాధితులతో రాష్ట్రంలో 18వ స్థానంలో ఉంది. ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు 1,899 మంది, న్యూరో బాధితులు 3,197 మంది, కాలేయ వ్యాధిగ్రస్థులు 767 మంది జిల్లాలో ఉన్నట్లు గుర్తించారు. బీపీ, షుగర్ బాధితులు గణనీయంగా ఉన్నారని, దీని కారణంగానే గుండె జబ్బులబారిన పడుతున్నారని వైద్యులు వివరించారు.

రైతు సేవాకేంద్రాల ద్వారా జొన్నల కొనుగోలు

జేసీ శివనారాయణశర్మ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రైతుసేవాకేంద్రాల ద్వారా జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన జొన్నలను కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తారన్నారు. కనీస మద్దతు ధర క్వింటాల్‌కి హైబ్రిడ్ రకం రూ.3,371, మల్దండి రకం రూ.3421గా నిర్ణయించామన్నారు. రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకుని ఉండాలన్నారు. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రైతుల కల్లాలనుంచే కొనుగోలు చేస్తామన్నారు. గోనెసంచులు, రవాణాచార్జీలు, కూలీల ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

15 వరకు కంది కొనుగోలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 15వతేదీ దాకా కంది కొనుగోలు చేస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి 25 నుంచి జిల్లా వ్యాప్తంగా 31 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి దాకా 7,900 మంది రైతుల నుంచి 10,600 మెట్రిక్ టన్నుల కందులు మద్దతు ధరతో కొనుగోలు చేశామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సు

అనంతపురం విద్య, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉద్యాన రైతుల రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు సీపీఐ, ఏపీ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం రాష్ట్ర కార్య నిర్వాహక అధ్యక్షుడు కాటమయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి మల్లికార్జున విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు ఎక్కువగా మామిడి, అరటి పండ్లతోటలతో పాటు పూలు, కూరగాయలు సాగుచేస్తున్నారని అన్నారు. ఉద్యాన పంటలకు అనువైనభూములు జిల్లాలో అందుబాటులో ఉన్నాయన్నారు. బోరుబావులు తవ్వించేలా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఉద్యాన రైతుల సదస్సును సీపీఐ శ్రేణులు, ఉద్యాన రైతులు, కూలీలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కొనసాగిన అంతర్ జిల్లా హాకీ టోర్నీ



తలపడుతున్న అనకాపల్లి, పశ్చిమ గోదావరి జట్లు

ధర్మవరం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలోని ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న 15వ జూనియర్ అంతర్ జిల్లాల హాకీ టోర్నీ రెండో రోజైన సోమవారమూ హోరాహోరీగా సాగాయి. ప్రకాశం జట్టుపై 1-3 గోల్స్ తేడాతో అనంతపురం జట్టు విజయం సాధించింది. అలాగే ఏలూరు జిల్లా జట్టుపై ఏడు గోల్స్ తేడాతో విశాఖపట్నం జిల్లా జట్టు, ఎన్టీఆర్ జిల్లాపై ఏడు గోల్స్ తేడాతో కడప జిల్లా, గుంటూరుపై ఐదు గోల్స్ తేడాతో అన్నమయ్య, వెస్ట్‌గోదావరిపై ఆరు గోల్స్ తేడాతో అనకాపల్లి, ఏలూరుపై రెండు గోల్స్ తేడాతో శ్రీకాకుళం జట్టు, చిత్తూరుపై ఆరు గోల్స్ తేడాతో కాకినాడ, బాపట్లపై రెండు గోల్స్ తేడాతో సత్యసాయి, నంద్యాలపై ఐదు గోల్స్ తేడాతో అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, కోశాధికారి థామస్ పీటర్, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి బంధనాథం సూర్యప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరీప్రసాద్, జిల్లా కోశాధికారి అంజన్న, జిల్లా జాయింట్ సెక్రటరీ అరవింద్‌గౌడ్, జిన్నేచందు, డైరెక్టర్లు మారుతి ప్రసాద్, ఇర్షాద్, అమునుద్దన్, కిరణ్, కోచ్ హస్సేన్ పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిగా భీమారావు

నెల్లూరు జిల్లా న్యాయాధికారిగా శ్రీనివాస్ బదిలీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన న్యాయాధికారిగా ఈ. భీమారావు నియమితుడయ్యారు. చిత్తూరు జిల్లా న్యాయాధికారిని జిల్లాకి నియమించారు. జిల్లా న్యాయాధికారి జి.శ్రీనివాస్‌ను నెల్లూరు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం హైకోర్టు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు జిల్లా న్యాయాధికారులు, అదనపు జిల్లా న్యాయాధికారులను బదిలీలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 21వతేదీలోపు బాధ్యతలు చేపట్టాలని అందులో పేర్కొంది. అనంతపురం పోక్సో కోర్టు న్యాయాధికారి టి.రాజ్యలక్ష్మిని ఒంగోలు మొదటి అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయాధికారి ఎస్.చిన్నబాబును అనంతపురం పోక్సో కోర్టుకు బదిలీ చేశారు. కడప జిల్లా న్యాయాధికారి జి.శ్రీదేవిని అనంతపురం ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ లేబర్ కోర్టు న్యాయాధికారిగా బదిలీ చేశారు. గుత్తిలోని ఆరో అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శ్రీహరిని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం 12వ అదనపు జిల్లా న్యాయాధికారిగా బదిలీ చేశారు. అనంతపురం నాలుగో అదనపు జిల్లా న్యాయాధికారిగా ఎం.శోభారాణిని ఖాళీగా ఉన్న కర్నూలు సీబీఐ కోర్టుకు బదిలీ చేశారు.

చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.25వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1326 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రెచ్చగొట్టకు.. చిచ్చు పెట్టకు..!

- బాధితులకు సాయం చేసి వెళ్లు
- జగన్‌కు పరిటాల సునీత సూచన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి/పెనుకొండ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజలను రెచ్చగొట్టకుండా, వారి మధ్య చిచ్చు పెట్టకుండా, బాధిత కుటుంబానికి సాయం చేసి వెళ్లాలని మాజీ సీఎం జగన్‌కు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. పాపిరెడ్డిపల్లికి మంగళవారం జగన్ వస్తున్న నేపథ్యంలో రామగిరిలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గతంలో పరిటాల రవీంద్ర పులివెందులకు వెళ్లినప్పుడు జగన్ కుటుంబం అడ్డుకుందని, అందుకే ఇప్పుడు జగన్‌ను అడ్డుకోవాలని తమ పార్టీ కార్యకర్తలు, పరిటాల అభిమానులు సూచిస్తున్నారని ఆమె అన్నారు. కానీ అది తమ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. పాపిరెడ్డిపల్లిలో అనుకోకుండా ఆ సంఘటన జరిగిందని, దాన్ని పరిటాల కుటుంబానికి ఆపాదించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ప్రకాశ్‌రెడ్డి మాటలు విని ఒక మాజీ ముఖ్యమంత్రి రావడం సరైందికాదని అన్నారు. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, ప్రకాశ్ రెడ్డి మధ్య వార్ జరుగుతోందని, వారిద్దరూ జగన్‌ను తీసుకురావడానికి పోటీ పడ్డారని అన్నారు. జగన్ రెడ్డిని రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ప్రకాశ్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని, దీని వల్ల కూడా లబ్ధిపొందే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. వైసీపీవారి రెచ్చగొట్టే వ్యాఖ్యలను పట్టించుకోవద్దని, సంయమనం పాటించాలని టీడీపీ నాయకులు సూచించారు. జగన్ పర్యటన గురించి పట్టించుకోవద్దని కోరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు: ఎస్పీ

మాజీ సీఎం జగన్ రాక సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ రత్న తెలిపారు. పెనుకొండ డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. లింగమయ్య హత్యకేసు నిందితులను 48 గంటల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. పాపిరెడ్డిపల్లి చిన్న గ్రామమని, ఇరుకు రోడ్లు ఉన్నందున ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావడానికి వీలుకాదని ఆమె అన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకులు పోలీసుల సూచనల మేరకు నడుచుకోవాలని కోరారు. మాజీ సీఎంతోపాటు నిర్దేశించిన నాయకులు మాత్రమే గ్రామ సందర్శనకు రావాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు జగన్ రాక

మాజీ సీఎం వైఎస్ జగన్ మంగళవారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వస్తున్నారు. ఇటీవల జరిగిన ఘర్షణలో మృతి చెందిన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శిస్తారు. చెన్నేకొత్తపల్లిలో హెలిప్యాడ్ ఏర్పాటుకు పోలీసులు అనుమతి నిరాకరించారు. కుంటిమద్ది హైస్కూల్‌లో జగన్ దిగేలా హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి లింగమయ్య ఇంటికి పది నిమిషాల్లో వెళ్లేలా పోలీసులు చర్యలు చేపట్టారు. వైసీపీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలసిల రఘురాం హెలిప్యాడ్‌ను సోమవారం పరిశీలించారు. జగన్ మంగళవారం ఉదయం 10 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరుతారు. మధ్యాహ్నం 12.30 గంటలకు తిరుగుప్రయాణమౌతారు.

70 రోజుల్లో పూర్తికావాలి

హంద్రీనీవా కాలువ పనులపై అధికారులకు మంత్రి కేశవ్ దిశానిర్దేశం



చిన్నముష్టూరు వద్ద కాలువ పనులను పరిశీలిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు 70 రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దిశానిర్ధేశం చేశారు. కాలువ పనులు పూర్తి చేసి, జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించిన మరుసటి రోజే పనులు ప్రారంభించామనీ, జిల్లా ప్రజల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు. ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో చేపడుతున్న హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను అధికారులతో కలిసి మంత్రి సోమవారం పరిశీలించారు. మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో హంద్రీనీవా కాలువ పనులపై హెచ్ఎన్ఎస్ఎస్ సీఈ నాగరాజు, ఎస్ఈ రాజా స్వరూప్‌కుమర్, ఈఈ శ్రీనివాస్‌నాయక్‌తో చర్చించారు. కాలువ లైనింగ్ పనులు, పూడిక తొలగింపుపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. 70 రోజుల్లోనే కాలువ వెడల్పు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఆదేశించారు. అనంతరం 33, 34, 35 ప్యాకేజీల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంపు పనులకు 2014, 2019ల్లో టీడీపీ హయాంలో శ్రీకారం చుట్టామన్నారు. అప్పట్లోనే 40శాతం పనులు కూడా పూర్తి చేశామన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. మరలా తాము అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రికి జిల్లాపై ఉన్న ప్రత్యేక శ్రద్ధతో చరిత్రలో ఎన్నడూలేని విధంగా రూ.3800 కోట్లు కేటాయించారన్నారు. ఒక్క పోలవరం మినహా, ఏ ప్రాజెక్టుకు ఇంతస్థాయిలో నిధులు కేటాయించిన దాఖలాలు లేవన్నారు. జిల్లాలో హంద్రీనీవా కాలువ 82 కి.మీలు ఉందనీ, ఇప్పటికే 12 కి.మీలు కాలువ వెడల్పు పనులు పూర్తి చేశామన్నారు. జూన్ 10 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం నిర్ధేశించుకున్నామన్నారు. పనులు పూర్తయితే, ఇది ఇంజనీరింగ్ అద్భుతమన్నారు. 20ఏళ్లలో జరగని పనిని 70 రోజుల్లో పూర్తి చేయాలన్నదే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. గత ప్రభుత్వం కనీసం కాలువపై కంపచెట్లు కూడా తొలగించలేదన్నారు. ఐదేళ్లలో గత పాలకులు కాలువలో తట్టెడు మట్టి కూడా తీయలేదని ధ్వజమెత్తారు. జిల్లాలో తొలి దశలో లైనింగ్ పనులు చేయడం లేదన్నారు. వైసీపీ హయాంలోనే లైనింగ్ చేయడానికి టెండర్లు పిలిచారని గుర్తుచేశారు. ఆరోజు ఒక్కరూ నోరు మెదపలేదన్నారు. ప్రజల మీద ప్రేమ కనబడలేదా అని ప్రశ్నించారు. గతంలో మాజీ సీఎం ఉరవకొండకు వచ్చి జలదీక్ష చేపట్టారనీ, ఆ సందర్భంగా మూడు నెలల్లో హంద్రీనీవా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరచిపోయారన్నారు. తమ ప్రభుత్వం హంద్రీనీవా పనులపై కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు పనుల పర్యవేక్షణకు వస్తారని ఆశిస్తున్నామనీ, వచ్చే సీజన్‌కు 8 నుంచి 9 మోటార్లు వాడేలా చర్యలు చేపడుతున్నామన్నారు. మల్యాల నుంచి జీడిపల్లి వరకూ కాలువ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే కాలువలో 3800 క్యూసెక్కుల నీరు ప్రవహించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో జరగని లైనింగ్ పనులపై వైసీపీ నేతలు ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. అక్కడ కొందరు లైనింగ్ కావాలని అడుగుతున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కార్యక్రమంలో డీఈ పీవీ రమణ, జేఈలు భాస్కర్, రాఘవేంద్ర, గౌస్‌బాషా, ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, సుంకరత్నమ్మ, మండల కన్వీనర్లు విజయ్ భాస్కర్, నూతేటి వెంకటేశులు పాల్గొన్నారు.

డ్రిప్ మంజూరులో టాప్

జాతీయ స్థాయిలో అనంతకు రెండోస్థానం: కలెక్టర్

ఏపీఎంఐపీ, కంపెనీలకు అభినందనలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డ్రిప్ పరికరాల మంజూరులో జాతీయ స్థాయిలో అనంత జిల్లా రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్ తదితరులు కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్‌శర్మను శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల మంజూరుకు లక్ష్యం విధించారని తెలిపారు. జిల్లాలోని 14,869 మంది రైతులకు 17,642 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్లు (98 శాతం) మంజూరు చేశామని అన్నారు. జాతీయ స్థాయిలో డ్రిప్ పరికరాల మంజూరులో రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానం రావడానికి కృషి చేసిన ఏపీఎంఐపీ అధికారులు, సిబ్బంది, డ్రిప్ కంపెనీల ప్రతినిధులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం సకాలంలో రైతులకు డ్రిప్ పరికరాలు మంజూరుతోపాటు సరఫరా చేయాలని సూచించారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో సమస్యలు పరిష్కరించాలి

- ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి



సర్వే నిర్వహిస్తున్న ఐద్వా నేతలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్ర జ్యోతి): అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తి స్థాయిలో వైద్యసేవలందించేందుకు వీలుగా అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్బన్ హెల్త్ సెంటర్లలో అందుతున్న వైద్య సేవలపై సోమవారం ఐద్వా ఆధ్వర్యంలో నగరంలో పలు ప్రాంతాల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రి మాట్లాడుతూ... సర్వే సందర్భంగా తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నా ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందలేదన్నారు. రాజీవ్ కాలనీ 49వ డివిజన్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో సర్వేకు వెళ్లినపుడు అక్కడి స్థానిక ప్రజలు, రోగులు అనేక సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. గైనకాలజిస్ట్, లేబర్ రూమ్, ప్రీ అడ్మిషన్ డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. చిన్నపిల్లల డాక్టర్లు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కోశాధికారి చంద్రిక, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవల బంద్‌కు

ఆస్పత్రుల నిర్ణయం

కలెక్టర్‌కు నోటీసు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించే వరకు ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిపి వేయాలని నెట్‌వర్క్ ఆస్పత్రులు నిర్ణయించాయి. నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోనూ వైద్యసేవలు నిలుపుదల చేస్తున్నామని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో.. కలెక్టర్‌కు సోమవారం నోటీసు పంపారు. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ (డీసీ)కి కూడా పంపారు. జిల్లాలో 49 ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు అందిస్తున్నారు. అధికారిక లెక్కల మేరకు రోజూ 120 నుంచి 140 వరకు వివిధ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం వైద్యసేవ బిల్లులు అందించకుండా పెండింగ్ పెడుతూ వచ్చింది. దీంతో బకాయిలు పేరుకుపోయాయి. వాటిని చెల్లించడానికి నూతన ప్రభుత్వం ఇబ్బందులు పడుతోంది. ఇదివరకు కూడా సేవలు నిలుపుదల చేస్తామని ప్రకటించగా.. బకాయిలను కొంతమేర విడుదల చేసింది. జిల్లాలో రూ.80 కోట్ల వరకు బకాయిలు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. ఇందులో గత వైసీపీ హయాంలో పెండింగ్ పెట్టినవే రూ.60 కోట్ల వరకు ఉంటాయని తెలుస్తోంది. సేవల బంద్‌కు నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. నెట్‌వర్క్ ఆస్పత్రులు నోటీసు ఇచ్చినా.. జిల్లాలో వైద్యసేవలు యథాతథంగా కొనసాగుతున్నాయని జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. సీరియస్ కేసులకు వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. సోమవారం కూడా 90 మందికి శస్త్ర చికిత్సలు చేయడానికి ఆయా ఆస్పత్రులు.. ఆన్‌లైన్ అప్‌లోడ్ చేశాయన్నారు. ఎక్కడా ఇబ్బందిలేకుండా జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవలు అందుతున్నాయని ఆయన వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నంబూరి ప్రసాద్ (ఫైల్)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచువారిపల్లిలో సోమవారం విద్యుదాఘాతంతో రైతు నంబూరిప్రసాద్ (46) మృతిచెందాడు. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నంబూరి ప్రసాద్ దోస, వరి, కలింగర పంటలు సాగు చేశాడు. పంటలకు తడులిచ్చేందుకు సోమవారం మధ్యాహ్నం పొలం వద్దకెళ్లాడు. మోటారు ఆన్ చేయబోగా.. విద్యుత్ సరఫరా కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకెళ్లి చూడగా.. ఫ్యూజు కాలిపోయింది. ఫ్యూజు వేస్తుండగా.. విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మరణించాడు. అంతకు మునుపు తోట వద్దకు రావాలని మిత్రులకు ఫోన్ ద్వారా తెలిపాడు. వారు పొలం వద్దకు వెళ్లగా విగతజీవిగా పడివున్న ప్రసాద్‌ను చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాద స్థలాన్ని ఏఎస్ఐ ప్రసాద్ పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. రైతుకు భార్య చంద్రకళ, కుమార్తెలు తేజస్విని, హర్షిత ఉన్నారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు యువకుల ఆత్మహత్య

తాడిపత్రి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరుచోట్ల సోమవారం ఇద్దరు యువకులు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానిక పోరాటకాలనీకి చెందిన నవీన్‌కుమార్ (30) యల్లనూరు రోడ్డు రైల్వే గేట్ సమీపాన సోమవారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నవీన్‌కుమార్ వ్యాన్ డ్రైవర్. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దనే ఉండేవాడు. వాహనానికి తెచ్చిన, చికిత్స కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని మదనపడుతుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది, రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి కి భార్య భార్గవి, మూడేళ్ల కుమారుడు ఉన్నారు. కుటుంబ స భ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోమలి సమీపంలో మరొకరు...

మండలంలోని కోమలి గ్రామ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చిన్నపొలమడ గ్రామానికి చెందిన నారాయణస్వామి (30) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నపొలమడ గ్రామానికి చెందిన పుల్లయ్య, రాజమ్మ దంపతుల కుమారుడు నారాయణస్వామి అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తిచెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు.

వృద్ధురాలి మృతి

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ నాలుగో నెంబర్ ప్లాట్‌ఫాం ఆవరణలో ఓ వృద్ధురాలు (65) ప్రమాదవశాత్తు కింద పడి సోమవారం మృతి చెందారు. రైల్వే ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలం వద్ద ఆధారాలపై ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకొని, ప్రభుత్వ వైద్యశాలకు తరలించి నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

నేడు ఏఐఆర్ఆర్ఎఫ్ ధర్నా

గుంతకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పెన్షన్ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గుంతకల్లు రైల్వే డివిజనల్ కేంద్రంలో మంగళవారం ఉదయం ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐఆర్ఆర్ఎఫ్ డివిజనల్ అధ్యక్షుడు జయంత్ కుమార్, కార్యదర్శి సుంకప్ప ప్రకటనలో తెలిపారు. కేంద్రం పెన్షన్ నియమాలకు ప్రమాదకరమైన సవరణలను చేసిందన్నారు. ఉద్యోగ విరమణ తేదీల ఆధారంగా పెన్షనర్లను వర్గీకరిస్తారన్నారు. దీంతో 8వ సీపీసీ లభించే హక్కుకు భంగం వాటిల్లుతుందన్నారు. దీనిని నిరసిస్తూ మంగళవారం ఉదయం 11 గంటలకు తమ సంఘ కార్యాలయం నుంచి ర్యాలీ చేపడతామన్నారు. డీఆర్ఎం ఆఫీసుకు చేరుకుని, అక్కడ నిరసన తెలుపుతుమన్నారు.

మే 17న జేఎన్టీయూ స్నాతకోత్సవం: వీసీ

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవాన్ని మే 17వ తేదీన నిర్వహించుకునేందుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చారని వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. స్నాతకోత్సవ సన్నాహాలపై అధికారులతో సోమవారం వర్సిటీలో సమీక్ష నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ.. పట్టాల ప్రదానోత్సవం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. సమన్వయంతో పనిచేసి, స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖలోని పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐసీడీఎస్ పరిధిలోని చిల్డ్రన్స్ హోంలో ఖాళీగా ఉన్న స్టోర్ కీపర్ కం అకౌంటెంట్(కాంట్రాక్టు), హౌస్ కీపర్(అవుట్‌సోర్సింగ్), ఎడ్యుకేటర్ (పార్ట్‌టైం), పీటీ ఇన్‌స్ట్రక్టర్ కం యోగా టీచర్ (పార్ట్‌టైం), మ్యూజిక్ టీచర్ (పార్ట్‌టైం) ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆమె సూచించారు.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉక్రెయిన్ యుద్ధ సమయంలో రష్యా నుంచి చౌకగా ముడిచమురు వస్తే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించకుండా అంబానీ కోట్లు దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కారణమైందని విమర్శించారు. ఓ వైపు మతభావాలను రెచ్చగొట్టడం, మరోవైపు ప్రజలపై భారాలు వేయడం బీజేపీ విధానం అన్నారు. వక్ఫ్ చట్టం చుట్టూ చర్చను లేవనెత్తి, గృహసిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు సిలిండర్‌పై రూ.50లు పెంచడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపైనా ఈ భారం పడుతుందన్నారు. గ్యాస్ ధరలను తగ్గించేలా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా ఒత్తిడి తేవాలని కోరారు.

శిథిలావస్థకు చేరిన డీఆర్‌డీఏ గెస్ట్‌హౌస్

● పట్టించుకోని అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ గెస్ట్‌హౌస్ శిథిలావస్థకు చేరింది. 1986 జనవరి 20వ తేదీన అప్పటి ఉమ్మడి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి రామచంద్రారెడ్డి, అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ అశోక్‌కుమార్ తిగిడి చేతుల మీదుగా డీఆర్‌డీఏ అతిథి గృహాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి జిల్లాకు వచ్చిన ఎంతోమంది మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఇతర ప్రముఖులు ఇందులో విడిది చేసేవారు. గత వైసీపీ ప్రభుత్వంలో నిర్వహణ లోపంతో గెస్ట్‌హౌస్ పూర్తిగా శిథిలా వస్థకు చేరింది. కొన్ని గోడలు కూలాయి. లోపల ఉన్న ఫర్నిచర్ అంతా దెబ్బతింది. చాలా మంది బసచేసిన గెస్ట్‌హౌస్ ఇలా శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఏమి ఉపయోగమనుకుంటే పొరపాటే.


శిథిలావస్థలో ఉన్న డీఆర్‌డీఏ గెస్ట్‌హౌస్

బయట ప్రైవేటు హోటళ్లకు బదులు గా నగర నడిబొడ్డున అన్ని వసతులతో ప్రభు త్వ కార్యాలయాలు తదితర వాటికి అందుబాటు లో ఉండే డీఆర్‌డీఏ గెస్ట్‌హౌస్‌ను ఉపయోగించుకునే ప్రముఖులు ప్రభుత్వానికి అద్దె చెల్లించేవారు. ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. పైగా ఇక్కడ పూర్తిగా పచ్చని చెట్లతో మంచి వాతావరణం ఉండేది. ఇప్పుడు లేదు. డీఆర్‌డీఏ గెస్ట్ హౌస్‌తో పాటు పక్కనే వాచ్‌మెన్ క్వార్టర్ ఉంది. అది కూడా పూర్తిగా ధ్వంసమైంది. వీటిని ఇలాగే వదిలేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే ప్రమాదం పొంచి ఉంది. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్యను వివరణ కోరగా.... కలెక్టర్ డీఆర్ డీఏ గెస్ట్‌హౌస్‌ను సందర్శించి పరిశీలించినట్లు తెలిపారు. ఆధునికీకరణకు ప్రతిపాదనలు పంపాలని ఆయన సూచించినట్లు పీడీ తెలిపారు.

న్యూస్ బాక్స్

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు: ఏఓ

గార్లదిన్నె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కషాయాలు తయారుచేసి పొలంలో చల్లితే పెట్టుబడులు తగ్గి, నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయాధికారి సోమశేఖర్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ సోమశేఖర్ మాట్లాడుతూ... వ్యవసాయంలో రసాయానికి ఎరువులు వినియోగించడం ద్వారా భూసారం తగ్గిపోతుందని, సేంద్రియ సాగుతో భూసారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఏపీఎం మల్లికార్జున, సీసీ రామాంజినేయులు, ఎంసీప నందిని, ఐసీఆర్‌పి వెంకటరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ విద్యార్థినికి ఎన్‌సీసీ అవార్డు


విద్యార్థిని రోజితను అభినందిస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని రోజితకు ఉత్తమ ఎన్‌సీసీ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు సోమవారం విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రొడ్రిజ్, క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ శారద, అనిల్ పాల్గొన్నారు.

ప్రతిభకు చిరునామా ఎస్కేయూ: ప్రిన్సిపాల్


విద్యార్థిని విష్ణుప్రియను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామచంద్ర

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యలో ప్రతిభకు చిరునామా ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల అని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సింపోయిజంలో ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి విష్ణుప్రియ తన ప్రతిభను కనబరిచి ప్రథమ బహుమతి పొందింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సోమవారం విష్ణుప్రియకు సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విభాగాధిపతి హేమంత్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో 2025-26 సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను ఒకేసారి చెల్లించిన వారికి 5శాతం రాయితీ వర్తిస్తుందని నగర కమిషనర్ బాలస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉంటుందని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


మహేష్ (ఫైల్)

గార్లదిన్నె, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మర్తాడు గ్రామ సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ తోటలో మహేష్ (26) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మర్తాడుకు చెందిన రామాంజి, వెంకటేశ్వరమ్మ దంపతులు ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. కొడుకులిద్దరిని బీటెక్ వరకు చదివించారు. చిన్న కుమారుడు మహేష్ బీటెక్ చేసి అనారోగ్యం కారణంతో కొద్దికాలంగా ఇంటి వద్దే ఉండేవాడు. పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఫలితం లేదు. సోమవారం ఉదయం వెంకటేశ్వరమ్మ, కుమారుడు మహేష్ ఇద్దరూ ద్విచక్ర వాహనంలో తోట వద్దకు వెళ్లారు. చీనితోటలో తల్లి వెంకటేశ్వరమ్మ పనిచేస్తుండగా మహేష్ ఓ చెట్టుకింద కూర్చున్నాడు. కొద్ది సేపటికి తల్లి పిలిచినా ఎంతసేపటికి రాలేదు. అనుమానం వచ్చి ఆమె అక్కడికి వెళ్లగా చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల రైతులు వచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహు టిన సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యపై ఆరా తీశారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని రహమత్ నగర్‌లో జరిగిన హత్యకేసులో నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టురోడ్డులోని లింగమయ్య బిర్యాని సెంటర్‌లో పనిచేస్తూ...రహమత్‌నగర్‌లోని మూడో క్రాస్‌లో ఉంటున్న అక్కిమి శ్రీధర్ అదే రూమ్‌లో ఉంటున్న నూర్ అహమ్మద్‌ను ఆదివారం బండరాయితో మోది హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై విచారించిన టూటౌన్ పోలీసులు సోమవారం ప్రకాష్‌రోడ్డులో ఉన్న శ్రీధర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

నగరంలో చైన్‌స్నాచింగ్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని తపోవనం సమీపంలో చైన్‌స్నాచింగ్ జరిగింది. నగరంలోని ఏఎస్ఆర్ నగర్‌లో నివాసముంటున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శ్రావణి తన తల్లిని స్కూటీలో హాస్పిటల్‌కు తీసుకెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇంటి సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి బైక్‌లో వేగంగా వచ్చి శ్రావణి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లాడు. అది తెగిపోవడంతో నాలుగు తులాల గొలుసులో మూడు తులాల బంగారం దొంగ చేతిలోకి వెళ్లింది. ఈ ఘటనపై బాధితురాలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఒలింపియాడ్‌లో ఎరా స్కూల్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థులతో పాఠశాల చైర్మన్ తదితరులు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో నిర్వహించిన సిల్వర్ జోన్ ఒలంపియాడ్ పరీక్షల్లో రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారిని పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు సోమవారం అభినందించారు. హిందీ, సోషల్, జీకే, రీజనరింగ్ సబ్జెక్టుల్లో పది మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పర్యటనను అడ్డుకుంటాం

● తెలుగుమహిళ నేత రామసుబ్బమ్మ


విలేకరులతో మాట్లాడుతున్న తెలుగు మహిళలు

చెన్నేకొత్తపల్లి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకుంటామని తెలుగుమహిళ హిందూపురం పార్లమెంట్ ప్రధానకార్యదర్శి పాలెం రామ సుబ్బమ్మ పేర్కొన్నారు. టీడీపీ స్థానికకార్యాలయంలో తెలుగుమహిళలతో కలిసి సోమవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజకీయ ఉనికి కోసం మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి శవరాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. నియోజకవర్గంలో కులమతాల మధ్య చిచ్చుపెడుతూ తమ స్వార్థం కోసం బీసీ కులాలను వాడుకోవద్దని హితవుపలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే పరిటాల సునీత సంయమనం పాటించాలని కార్యకర్తలకు చెబుతున్నారే కానీ మీలాగా హత్యారాజకీయాలు చేయడం టీడీపీ సంస్కృతి కాదన్నారు. సమావేశంలో తెలుగు మహిళలు వరలక్ష్మి, అస్మత్‌బీ, విజయ, లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

'15 ఏళ్లుగా తిప్పుకుంటున్నారు'

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దాదాపు 15 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, అయినా తన న్యాయమైన సమస్యను పరిష్కరించడం లేదని పెద్దవడుగూరుకు చెందిన హెచ్చెల్సీ ఆయకట్టుదారుడు బాలరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పెద్దవడుగూరు మండలం మిడుతూరులోని సర్వేనంబరు 236-సి3లో 8.73ఎకరాల భూమిని హెచ్చెల్సీ లోకలైజేషన్ చేయడానికి సర్వే నంబరు 235, 237లో 39 సెంట్లను భూసేకరణ కింద తీసుకున్నారన్నారు. 1963-65 మధ్య కాలంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ల్యాండ్ వెరిఫికేషన్ చేసి కాలవ తీసేందుకు సర్వేయర్ ద్వారా హద్దులు గుర్తించారని అర్జీలో బాధిత రైతు తెలిపారు. అయితే 2009లో తన పొలంలోకి నీరు రాకుండా కొందరు అడ్డుకుని, కాలవ పూడ్చి, దారి లేకుండా చేశారన్నారు. దీనిపై 2010 నుంచి పోరాటం చేస్తున్నా హెచ్చెల్సీ, తహసీల్దార్ కార్యాలయాల అధికారులు ఒకరిపై ఒకరు చెబుతూ కాలయాపన చేస్తున్నారని వాపోయారు. అనంతరం హెచ్చెల్సీ కాలనీలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్‌కి వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల్లో మార్పునకు శ్రీకారం చుడదాం

● ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) నాయకులు

అనంతపురం క్రైం, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మంచి నాయకత్వాన్ని ఎన్నుకుని మార్పునకు శ్రీకారం చుడదామని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌రసూల్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు రాజారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 11న బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు జరగనున్నాయన్నారు. పోరాట పటిమను పెంచడానికి కృషి చేస్తానని మాట ఇచ్చిన వారికి ఓటు ఇవ్వడం ద్వారా మార్పునకు శ్రీకారం చుడదామన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి: ఎంపీపీ

రాప్తాడు ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీపీ జయలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అమలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు విద్యుత్ సమస్యలే లేకుండా వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ సాకే తిరుపాలు, పలు శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

దాడి చేశారని రైతు ఆత్మహత్యాయత్నం

నార్పల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగే తిమ్మంపల్లికి చెందిన వెంకటశివ అనే రైతు పురుగుమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వెంకటశివ అనే రైతుకు సంబంధించి గ్రామంలో 12 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. అతడు తన వ్యవసాయ తోటలోకి వెళ్లకుండా అదే గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి, రాజశేఖర్, బ్రహ్మయ్య, కేశవయ్య అనే రైతులు సోమవారం దారి అడ్డగించి, మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో రైతు వెంకటశివ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతడిని కుటుంబ సభ్యులు నార్పల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.... దాదాపు ఎనిమిది నెలలుగా తమ పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. రెవెన్యూ అధికారులు దాదాపు ఐదు సార్లు కొలతలు వేసి పోలీసుల సమక్షంలో హద్దు రాళ్లు నాటినప్పటికీ, వారు వాటిని దౌర్జన్యంగా తొలగించారన్నారు. అడ్డు వెళ్లిన తన భర్త వెంకటశివను దారుణంగా కొట్టారని వెంకట శివ భార్య ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికైనా తమ పొలానికి దారి చూపించాలని వారు కోరారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని ఎస్ఐ సాగర్ తెలిపారు.

దాడి చేసినా పట్టించుకోలేదని వృద్ధురాలి ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తనపై కోడలు, ఆమె తమ్ముడు దాడి చేసినా పట్టించుకోలేదని ఓ వృద్ధురాలు ఎస్పీ జగదీష్‌కు విన్నవిం చుకుంది. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారంనిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో నార్పల మండలం నిలువు రాయికి చెందిన ఎలుగు రామలక్ష్మమ్మ జిల్లా ఎస్పీని కలిసి సమస్య విన్న వించింది. తన భర్త ద్వారా సంక్రమించిన ఆస్తి, బంగారు ఆభరణాల విషయంలో ఫిబ్రవరి 27న తనపై తన కోడలు రత్నమ్మ, ఆమె తమ్ముళ్లు నాగేంద్ర, నాగరాజు కలిసి దాడి చేశారని వాపోయింది.

'పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి'

శింగనమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు సంబంధించి రైతులకు వెంటనే నష్టపరిహారం అందజేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అలాగే అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందజేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు తీవ్రం ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే అన్నదాత సుఖీభవ పథకం విడుదల చేయాలని అఖిల భారత కూలీ సంఘం జిల్లా నాయకుడు తరిమెల రామాంజినేయులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

కోర్టు హాళ్లలో అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలు


అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయాధికారి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టుల హాళ్లలో డాక్టర్ అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలను ఏర్పాటుచేశారు. బహుజన లాయర్స్ ఫోరం(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు బానాసి నారాయణప్ప అధ్వర్యంలో సోమవారం వాటిని ఏర్పాటు చేశారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసులు వాటిని ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ అపద్ధర్మ అధ్యక్షుడు గురుప్రసాద్, బీఎల్ఎఫ్ రాష్ట్ర చైర్మన్ కిష్టప్ప, న్యాయవాదులు వెంకటరాముడు, హరినాథ్‌రెడ్డి, రవికుమార్, వంశీ, నరసింహులు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వనభోజనాల సందడి


వనభోజనాలకు వెళుతున్న శివపురం వాసులు

శింగనమల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని శివపురం వాసులు శ్రీరామనవమి మరుసటి రోజు వనభోజనాలు చేశారు. వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ గ్రామస్థులందరు గ్రామ దేవతలకు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామ శివార్లలో వనభోజనాలు చేశారు.

● రాప్తాడు: మండలంలోని యర్రగుంట, గొందిరెడ్డిపల్లి, రామినేపల్లి, బోగినేపల్లి తదితర గ్రామాల ప్రజలు సోమవారం వనభోజనాలకు వెళ్లారు. వంట సామగ్రి తీసుకుని ఇళ్లకు తాళాలు వేసి పొలాల్లోకి వెళ్లారు. అక్కడే వంట చేసుకుని సాయంత్రం వరకూ పొలాల్లో గడిపారు. మహిళలు, యువకులు ఆట, పాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. సాయంత్రం గంపలు ఎత్తుకుని బొడ్రాయికి పూజలు చేసి ఇంటి గుమ్మం వద్ద టెంకాయి కొట్టి ఇళ్లలోకి ప్రవేశించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు సమర్పించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.


రామినేపల్లిలో ఆటలతో గడుపుతున్న యువకులు

ఉద్యోగ భద్రత కల్పించాలి

● ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జేఏసీ నాయకులు


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో 19 ఏళ్లుగా పనిచేస్తున్నామని... పనిఒత్తిడి తగ్గించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డ్వామా ఉద్యోగుల జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ అధ్యక్షుడు రామాంజినేయులు మా ట్లాడుతూ... జిల్లాలోని నార్పల మండలం బండ్లపల్లిలో 2006లో ప్రారంభించిన మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు వరంగా నిలుస్తోందన్నారు. అటువంటి పథకంలో పని చేస్తున్న తమను సామాజిక తనిఖీ, క్వాలిటీ కంట్రోల్ విభాగాలతో, టార్గెట్ పేరుతో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేయడం బా ధాకరమన్నారు. గతంలో ఉన్న టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు అన్ని వసతు లు కల్పించే అవకాశం ఉండేదని, ఎన్ఐసీ సాఫ్‌వేర్‌కు మార్చిన తరువాత ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు. ఉపాధి కూలీలకు పనికి తగిన వేతనం చెల్లించేందుకు పనులలో మార్పులు చేయాలని, పూర్తి పని చేయించేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. కూలీలకు అనుకూలంగా పనులు చేయించినా సర్‌ప్రైజ్ విజిట్, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేసి ఎంబుక్ రికార్డు ప్రకారం కొలతలు లేవని ఉద్యోగుల నుంచి రికవరీ పెట్టడం దారుణమన్నారు. అనంతరం డ్వామా పీడీ సలీంబాషాకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ కోశాధికారి హనుమంతరెడ్డి, కిష్టప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై ఊరేగిన సీతారాములు


సింహవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజున సోమవారం మొదటి రోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో రాములవారు సింహవాహనంపై ఊరేగారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని సీతా రాముల మూల విరాట్లకు వివిధ అభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో సింహవాహనంపై స్వామివారిని ఆశీనులను చేసి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శోభ, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, జీజే వేణు, పరమేష్ భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు


అలంకరణలో మూలవిరాట్లు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శారదానగర్‌లోని శివ బాలయోగి ఆశ్రమం లో మార్చి 30 నుంచి నిర్వహిస్తున్న వసంత నవ రాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా అనంతేశ్వరి సమేత అనంతేశ్వరస్వామికి భక్తుల చేతుల మీదుగా క్షీరాభిషేకం, 33 రకాల పుష్పాలతో పుష్పాభిషేకం, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు పల్లకిసేవ నిర్వహించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్న దానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, అమ్మవారి పల్లకిసేవ చేస్తున్న భక్తులు

కోదండ రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్/కల్చరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనగర్‌లోని కోదండ రామాలయంలో సోమవారం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు వడించారు. ప్రజలపై కోదండ రాముని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు గంగారామ్, కూచి హరి, చేపల హరి, బాబాఫక్రుద్దీన్, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, ఓంకార్‌రెడ్డి, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి : సీపీఐ

నార్పల, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దారు అరుణకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్ మాట్లాడుతూ... నార్పలను కరువు మండలంగా ప్రభుత్వం ప్రకటించింది, కానీ మండలంలో ఎక్కడా కరువు సహాయ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు మండలంలో పండ్ల తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం వారిని అదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు సుధాకర్, పెద్ద పెద్దయ్య, నారాయణప్ప, అల్తాఫ్, సూరి, చంద్ర, శివశంకర్, నారాయణ, శీనా, తిమ్మరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంతోనే భవిష్యత్తు

● డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరంగా ఉన్నపుడే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందని, అందుకే ప్రతిఒక్కరు ఆరోగ్యంతులుగా ఉండడానికి ప్రయత్నించాలని డీఎంహెచ్ఓ డాక్టరు ఈ.బీదేవి పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని డీఎంహెచ్ఓ ప్రారంభించగా, జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా ర్యాలీ సాగింది. తిరిగి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ ఓబులు, డెమోలు త్యాగరాజు, గంగాధర్, వైద్య ఉద్యోగులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'ప్రపంచాన్ని శాసిస్తున్న మెకానికల్ ఇంజనీరింగ్'


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి కల్పనలతో మెకానికల్ ఇంజనీరింగ్ ప్రపంచాన్ని శాసిస్తోందని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగధిపతి డాక్టర్ కళ్యాణిరాధ పేర్కొన్నారు. సోమవారం డాక్టర్ ఓంప్రకాష్ అధ్యక్షతన ఫేర్‌వెల్ డే వేడుకలు నిర్వహించారు. ఆమెతో పాటు సీనియర్ ప్రొఫెసర్లు నాగప్రసాద్ నాయుడు, ప్రశాంతి, హేమచంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల ఘనిగా మెకానికల్ ఇంజనీర్ వెలు గొందుతోందని పేర్కొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు అశోక్‌చక్రవర్తి, వెంకటేష్, దాదా ఖలందర్, భరద్వాజ్, శశిధర్‌రెడ్డి, నాగరాజు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఆదర్శప్రాయుడు వాల్మీకి: విప్ కాలవ



వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న విప్ కాలవ

కణేకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయుడని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండలంలోని హనకనహాళ్ గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఒక సాధారణ వ్యక్తిగా ఉన్న వాల్మీకి రామాయణం లిఖించడం ద్వారా చరిత్రలో ఒక ఉన్నతస్థాయిలో నిలిచిపోయారన్నారు. టీడీపీ మండల కన్వీనర్ లాలెప్ప, ఎస్కే మల్లికార్జున, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, మారుతి, షేక్ముజ్జు, నాగార్జున, హనుమప్ప పాల్గొన్నారు.

శవ రాజకీయాలకు వైసీపీ పుట్టినిల్లు

● వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమేష్



మాట్లాడుతున్న వైపీ రమేష్, టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శవ రాజకీయాలకు వైసీపీ పుట్టినిల్లుగా మారిందని వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్, చౌళం మల్లికార్జున విమర్శించారు. సోమవారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం మండలం సీబాయి గ్రామంలో వైసీపీ కార్యకర్త చాకలి రామాంజనేయులు గుండెపోటుతో మృతి చెందితే దానిని శవరాజకీయాలకు వైసీపీ తెరలేపిందన్నారు. టీడీపీ నాయకుల వేధింపులతోనే మృతి చెందాడని చెప్పుకుని శవంతో రాజకీయాలు చేశారని విమర్శించారు. ఎమ్మెల్యేపై బురద జల్లుతూ శవరాజకీయాలు చేస్తుంటే ఇక్కడ చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మార్కెట్ యార్డు చైర్పర్సన్ లక్ష్మీదేవి, గోళ్ల వెంకటేశులు, సర్పంచ్ బొజ్జన్న, రామ్మోహన్ యాదవ్, రాజశేఖర్, కొల్లాపురప్ప పాల్గొన్నారు.

మళ్లీ ఇన్చార్జి పాలనే..

యల్లనూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజా సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు తిరిగి పుట్లూరు తహసీల్దార్కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించారు. వారంరోజులక్రితం అధికారపార్టీకి చెందిన నాయకులు స్టోర్ విషయంలో కార్యాలయంలోనే తహసీల్దార్తో గొడవకు దిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన సెలవుపై వెళ్లారు. తాజాగా సోమవారం పుట్లూరు తహసీల్దార్కు ఇన్చార్జి బాధ్యతలు అప్పగించినట్లు కార్యాలయానికి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో తిరిగి కష్టాలు మొదలవుతాయని కార్యాలయం వద్ద ప్రజలు చర్చించుకోవడం కనిపించింది.

16న మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందన్నారు.

ఉత్సాహంగా రాతిదూలం లాగుడు పోటీలు

యాడికి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని బోయరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన రాతిదూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను యాడికి సీఐ ఈరన్న ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు రైతులు సమష్టిగా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. మొత్తం 9జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో మొదటి బహుమతి పెద్దపేట గ్రామానికి చెందిన చెన్నారెడ్డి ఎద్దులు, రెండవ బహుమతిని ఈరన్నపల్లి గ్రామానికి చెందిన వెంకటరాముడు ఎదులుఉ, మూడో బహుమతిని కొత్తపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్ ఎద్దులు, నాలుగో బహుమతిని తాడిపత్రికి చెందిన నాగార్జున ఎద్దులు గెలుపొందాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. పడమల పెద్దయ్య, నాగేశ్వర, చిన్నపెద్దయ్య, కొత్తరాయుడు, హరి పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి వాటర్ కార్మికులు, సీఐటీయూ సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్తో కలిసి సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఆరు నెలల జీతాలు, 30 నెలల ఈపీఎఫ్ తమ ఖాతాలో జమ చేయాలని ఆర్డీవో వసంత్బాబుకు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళతామని ఆర్డీఓ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

కూడేరు: పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికులు వేతనాలు, పెండింగ్ పీఎఫ్ కోసం చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నీటిని విడుదల చేసే ప్రసక్తిలేదని కార్మికులు తేల్చి చెప్పారు.

రిలే దీక్షకు ఎమ్మెల్యే మద్దతు

తాడిపత్రి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): వక్ఫ్బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం పట్టణంలో ముస్లింలు ఏర్పాటుచేసిన రిలేనిరాహార దీక్షకు ఎమ్మెల్యే జేసీ అస్మిత్రెడ్డి ర్యాలీగా వెళ్లారు. అనంతరం ముస్లింలు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్బోర్డు సవరణ బిల్లులో ఏమైనా లోటుపాట్లు ఉంటే తప్పకుండా సీఎం దృష్టికి తీసుకువెళతానని వారికి హామీ ఇచ్చారు.

విద్యార్థినికి సన్మానం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బీటెక్లో గోల్డ్ మెడల్ సాధించిన సబియాసుల్తానా అనే విద్యార్థినికి సోమవారం అభయ విద్యానిధి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సంస్థ అధ్యక్షురాలు దేవరశెట్టి మాధవీలత మాట్లాడుతూ సంస్థ ద్వారా ఇప్పటివరకు 120 మందిపేద విద్యార్థినులను చదివిస్తున్నామని తెలిపారు. గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఈఈఈ ఫైనల్ ఇయర్ చదువుతున్న సబియా సుల్తానాకు జేఎన్టీయూ యూనివర్సిటీ గోల్డ్మెడల్ ప్రకటించిందన్నారు. అనంతరం విద్యార్థినిక శాలువ, పూలమాలలతో సత్కరించారు. సంస్థ చైర్మన్ సత్రసాల వసుంధరాదేవి, కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి అనురాధ పాల్గొన్నారు.



సబియా సల్తానాను సన్మానిస్తున్న అభయ విద్యానిధి సభ్యులు

డీలర్లకు బఫర్ కష్టాలు..!

● అరకొరగా రేషన్ పంపిణీ

● బియ్యం అందక లబ్ధిదారుల గగ్గోలు



బియ్యం పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలో రేషన్కార్డుదారులకు ఏప్రిల్ నెలలో రేషన్బియ్యం పూర్తిస్థాయిలో అందే పరిస్థితి కనిపించడం లేదు. బఫర్ సమస్య కారణంతో బియ్యం పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ప్రతినెల లబ్ధిదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో బఫర్ స్టాకు సమస్యతో ప్రస్తుతం డీలర్లు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెల బఫర్స్టాకుతో రేషన్బియ్యం తక్కువ క్వింటాళ్లు సరఫరా చేస్తున్నారు. ఇలాగైతే లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేసేదని డీలర్లు వాపోతున్నారు. ప్రతినెల రేషన్ బియ్యంలో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కేజీలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం సక్రమంగా అందడం లేదని డీలర్లు మోసం చేస్తున్నారని లబ్ధిదారుల నుంచి విమర్శలను కొత్త ప్రభుత్వం మూటగట్టుకుంటోంది. అయినా అధికారుల తీరు మారడం లేదు. సివిల్ సప్లై అధికారులు కొత్త ప్రభుత్వనికి చెడ్డపేరు తెచ్చే విధంగా పనిచేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో 39 రేషన్ దుకాణాలల్లో 18,117 కార్డులు ఉన్నాయి. ఈ నెల 2,476.14 క్వింటాళ్ల బియ్యాన్ని సరఫరా చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న బఫర్ను వసులు చేయకపోవడంతో రేషన్ బియ్యం తక్కువగా వస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా వైసీపీ మద్దతుదారులు ఉన్న డీలర్లను విచారించాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా బఫర్ తీస్తున్నారు:
- సుధాకర్, స్టాక్ పాయింట్ అధికారి, కణేకల్లు

రాష్ట్ర వ్యాప్తంగా బఫర్ను డీలర్లను తీసుకుంటున్నారు. అదే విధంగానే బఫర్ స్టాక్ను పట్టుకొంటున్నాం. ఉన్నతాధికారులు అదేశాల మేరకే బఫర్ స్టాక్ను డీలర్లకు సమాచారం ఇచ్చి పట్టుకొంటున్నాం.

రేపు బెళుగుప్పలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

బెళుగుప్ప: మండల కేంద్రంలోని నగరేశ్వర ఆలయంలో బుధవారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ అధ్యక్షతన ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రోడ్లు, హంద్రీనీవా పథకం కింద భూములు కోల్పోయిన రైతులకు మంత్రి నష్టపరిహారం అందజేశారన్నారు. మంత్రికి సమస్యలు తెలుపుకోవాలని ప్రజలను కోరారు. కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి డిమాండ్ చేశారు. స్థానిక బీటీ పక్కీరప్ప భవనంలో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజురీయింబర్స్మెంట్, వసతిదీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కాలేజీలు, పాఠశాలల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు వినోద్కుమార్, వెంకట్నాయక్, అఖిల్, రోహిత్, శివమణి, రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

కుందుర్పి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. స్థానిక ఆ పార్టీ నాయకులు ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రంగనాథ్, పెద్ద నరసింహప్ప, మల్లికార్జున, రవి, రామ్మూర్తి, వైబీ ఓబయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కబ్జా యత్నంపై ఫిర్యాదు

గుంతకల్లుటౌన్,ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనిముక్కల గ్రామంలోతమ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారని సోమవారం తహసీల్దారు కార్యాలయంలో జరిగిన స్పందనలో తహసీల్దారుకు కరుణం జయప్రకాష్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆయన మాట్లాడుతూ గ్రామ పొలం సర్వే నెంబరు 39-బీలో 3.46సెంట్ల భూమి తమకు వారసత్వంగా సంక్రమించిందన్నారు. గ్రామానికి చెందిన శ్రవణ్, తలారి రాము, తలారి నారాయణస్వామి, ఎస్ మనోజ్కుమార్, కొంగనపల్లి లక్ష్మణస్వామి కలిసి తమ భూమిలోని 950సెంట్ల భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారన్నారు.

తాగునీటి సమస్య రానివ్వం

పుట్లూరు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో తాగునీటి సమస్య రానివ్వమని టీడీపీ మండల నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సహకారంతో రూ.2కోట్ల వ్యయంతో శుద్ధజల ప్లాంట్ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాలనీల్లో తాగునీటి సమస్య వస్తే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

ప్రారంభమైన చెన్నమ్మతల్లి తిరునాళ్ల

పెద్దవడుగూరు, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులుడికి గ్రామంలో సోమవారం చెన్నమ్మతల్లి తిరునాళ్ల ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. రాత్రికి గంగమ్మతల్లి పెట్టె మెరవణితోపాటు అమ్మవారి కథ పారాయణం జరిగింది. పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

వడ్డీతో పంట రుణాలను రెన్యువల్ చేయాలి

యాడికి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్కు సంబంధించి వడ్డీతోనే పంట రుణాలను రెన్యువల్ చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు వడ్డి రాజశేఖర్ కోరారు. సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా పంటలు పండక రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడేళ్లు యాడికి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించారని, రైతులకు మాత్రం కరువు సహాయక చర్యలు ఏమాత్రం అందలేదని తెలిపారు. బ్యాంకర్లు రైతుల నుంచి కేవలం వడ్డీ కట్టించుకొని పంట రుణాలను రెన్యువల్ చేయాలని వారు కోరారు. నాయకులు నాగశేఖర్, మురళీ పాల్గొన్నారు.

అధికారుల డుమ్మా

శెట్టూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు కొంతమంది అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్, ఎంపీడీవో, వ్యవసాయాధికారి సూపర్వైజర్ హాజరుకాగా, పలువురు అధికారులు సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. చివరికి తహసీల్దార్, వ్యవసాయాధికారి, సూపర్వైజర్ మాత్రమే కనిపించారు. సమస్యల పరిష్కారం కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరిగివెళ్లారు. జిల్లా అధికారులు మండలస్థాయి అధికారులు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణం



తహసీల్దార్కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకపోవడం దారుణమని వైసీపీ నాయకులు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్కు వినతిపత్రం అందజేశారు. నాయకులు భూమిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ భారీవర్షాలు వస్తేనే తాగు, సాగు నీరు అందుతున్నాయన్నారు. మండలవ్యాప్తంగా గతేడాది వర్షాలు లేక ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసిన దాఖలాలు ఉన్నాయన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని పుట్లూరు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్చేశారు. విష్ణునారాయణ, నాగేశ్వరరావు, సర్పంచు బాబు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్ ప్రారంభం

గుత్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిసెట్ ఉచిత కోచింగ్ను ప్రారంభించినట్లు సోమవారం కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ తెలిపారు. పదో తరగతి విద్యార్థులు పాలిసెట్-2025 ప్రవేశ పరీక్షల ద్వారా డిప్లొమా కోర్సుల్లో చేరాలనుకునే వారి సౌకర్యార్థం కోచింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సెల్:8333987202 సంప్రదించి తమ పేర్లనునమోదు చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహులు, ఏఓ ఇంతియాజ్బాషా, హెచ్ఓడీ హరిప్రియ, పాల్గొన్నారు.

కోడిమూర్తిలో ఘర్షణ

యల్లనూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడిమూర్తి గ్రామంలో ఆదివారం రాత్రి స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. చిలమకూరు, కోడిమూర్తి గ్రామాలకు చెందిన కొంతమంది యువకులు మొదట చిత్రావతి నదిలో గొడవపడ్డారు. ఈ విషయంపై మరోసారి చిలమకూరు గ్రామానికి చెందిన యువకులు అర్ధరాత్రి సమయంలో కోడిమూర్తికి రావడంతో మరోసారి ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. ఇరువురు ఒకరిపై ఒకరు రాళ్లదాడి చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దీనిపై యల్లనూరు పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఘనంగా చౌడమ్మతల్లి జ్యోతుల మహోత్సవం

పుట్లూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లి గ్రామంలో సోమవారం చౌడమ్మ జ్యోతుల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారి ప్రతిమలతో జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు.

సచివాలయాల్లో పనిచేయని ప్రింటర్లు

● అన్నదాతల ఆగ్రహం... నిరసన



కూడేరు సచివాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

కూడేరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో పంట రుణాల రెన్యువల్కు అవసరమైన వన్ బి, అడంగల్ పత్రాల కోసం సచివాలయాలకు వెళితే ప్రింటర్లు పనిచేయడం లేదని సిబ్బంది చెప్పడంతో అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా మండలంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, స్టేట్ బ్యాంకులతోపాటు వివిధ గ్రామాల్లో ఉన్న బ్యాంకుల్లో పంటరుణాల రెన్యువల్ చేస్తున్నారు. ఇందుకు అవసరమైన వన్ బి, అడంగల్ పత్రాల కోసం సచివాలయాలకు వెళితే అక్కడ సిబ్బంది ప్రింటర్లు పని చేయడం లేదని సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం-1, 2 కేంద్రాల్లో కొందరు రైతులు వన్ బి, అడంగల్ పత్రాల కోసం వచ్చారు. రెండు సచివాలయాల్లో ప్రింటర్లు పనిచేయడం లేదని సిబ్బంది చెప్పడంతో సచివాలయం ఎదుట రైతులు నిరసనకు దిగారు. సచివాలయంలో ఇంత మంది సిబ్బంది ఉన్నా ఏం ప్రయోజనం ఉందని మండిపడ్డారు. వన్ బి, అడంగల్ కోసం మీ సేవా కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీసేవా కేంద్రం కిటకిట: పంట రుణాల రెన్యువల్కు అవసరమైన వన్ బి, అడంగల్ కోసం అన్నదాతలు మీసేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. దీంతో కేంద్రాలు అన్నదాతలతో కిటకిటలాడుతున్నాయి. సచివాలయాలు ఉండీ ఉపయోగపడటంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 11 గ్రామ సచివాలయాల్లో కేవలం మూడు చోట్ల మాత్రమే ప్రింటర్లు పని చేస్తుండటాన్ని చూస్తే ప్రజలకు ఎలాంటి సేవలు అందుతున్నాయో అర్థమవుతుంది.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



గుత్తిలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఎల్లప్ప

బొమ్మనహాళ్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీధరఘట్ట గ్రామంలో పీహెచ్సీ వైద్యాధికారులు కుమార్రాజ, గీతాభార్గవి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బాలింతలు, నవజాత శిశువుల ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది శివప్రసాద్, విజయభారతి పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితంతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని వైద్యాధికారి రమేష్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా భంభంస్వామి లేఅవుట్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఆనందానికి, సంతోషానికి ఆరోగ్యమే కొలమానం అని చెప్పారు. ఆరోగ్య విద్యా బోధకుడు కెంచె లక్ష్మీనారాయణ, డాక్టర్ యశ్వంత్రాజ్, ఆరోగ్య ఆశాకార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఐసీటీసీ విభాగం మాస్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మేర్సీ జ్ఞానసుధ ఆధ్వర్యంలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. స్థానిక ఆసుపత్రి వద్ద నుంచి పాత బస్టాండ్ వద్ద వరకు ర్యాలీ నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, ల్యాబ్ టెక్నీషియన్ అల్తాఫ్, పీయూ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, టీబీ ల్యాబ్ టెక్నీషియన్ సురేష్బాబు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైద్యాధికారి ఎల్లప్ప మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు అందుతున్న వసతుల గురించి అవగాహన కల్పించారు. ఆస్పత్రి వైద్యులు, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు రేణుకమ్మ, రేవతి, మల్లికార్జునపాల్గొన్నారు.

వైభవంగా రంగనాథస్వామి రథోత్సవం



రథానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపులపర్తిలో వెలసిన లక్ష్మీరంగనాథస్వామి రథోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున స్వామివారి కల్యాణం, మరుసటి రోజు రథోత్సవాన్ని నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరయ్యారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో నందకిషోర్ హాజరయ్యారు. మేళతాళాలతో ఎమ్మెల్యేను ఊరేగింపుగా రంగనాథస్వామి రథోత్సవం దగ్గరికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రథానికి ప్రత్యేక పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు.

బూదగవిలో అభయాంజనేయస్వామి..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి గ్రామంలో అభయాంజనేయస్వామి రథోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లి, రథంపై కొలువుదీర్చి, ఆలయం నుంచి ఆంజనేయస్వామి పాదాల వరకూ రథాన్ని లాగారు. మాజీ సర్పంచ్ చిరంజీవి, హనుమంతు రాయుడు, నాగేంద్ర పాల్గొన్నారు.

సీతారాముల రథోత్సవం: వజ్రకరూరు మండలంలోని గూళ్యపాలెంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని సీతారాముల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో స్వామి వారి మూలవిరాట్కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.

యర్రగుంటలో యణ్ణేరంగస్వామి..



ఊరేగుతున్న యణ్ణేరంగస్వామి రథం

కణేకల్లు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట గ్రామంలో వెలసిన యణ్ణేరంగస్వామి రథోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తుల సమక్షంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అలంకరించి ఆలయ ఆవరణలో రథాన్ని లాగారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి రథాన్ని వీక్షించారు. మంగళవారం నుంచి ఎద్దుల పరుష నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు.

కమనీయంగా సీతారాముల కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు

తాడిపత్రి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపొలమడ గ్రామంలో వెలసిన రామాలయంలో సోమవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల మూలవిరాట్లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ చేసి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

శివలింగంపై సూర్యకిరణాలు



స్వామివారిపై పడిన సూర్యకిరణాలు

శెట్టూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపల్లి గ్రామంలో సోమవారం శివాలయంలో సూర్య భగవానుడి కిరణాలు స్వామివారిని తాకాయి. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో మాత్రమే ఇలా జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

చౌడేశ్వరిదేవి జాతర ప్రారంభం



అలంకరణలో అమ్మవారు

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మల్లాపురం, పల్లేపల్లి గ్రామాల సమీపంలో వెలసిన చౌడేశ్వరీ దేవి ఆలయంలో మూడురోజుల జాతర మహోత్సవం సోమవారం ప్రారంభమైంది. అమ్మవారికి ఉదయమే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు నిర్వహించారు.

పురవీధుల్లో ఊరేగిన పార్వతీపరమేశ్వరులు

కూడేరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జోడులింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రెడ్డివారి సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులు గ్రామ పురవీధుల్లో విహరించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి రుద్రాభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి సమయంలో స్వామివార్లు శేష వాహనంలో ఊరేగించారు. రెడ్డి వారి సంఘం ఆధ్వర్యంలో స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, విద్యుద్దీపాల నడుమ స్వామివారు భక్తులకు దర్శనమించారు.

దివ్యాంగులకు న్యాయం చేయండి

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు న్యాయం చేయాలని సోమవారం ఆర్డీవో వసంత్ బాబుకు దివ్యాంగుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ కనుసన్నల్లో వైసీపీ నాయకులు దివ్యాంగులకు సంబంధించిన స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి తమపై బెదిరింపులకు గురిచేశారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే ఆర్డీవో, కుందుర్పి రెవెన్యూ అధికారులకు కోర్టులో కౌంటర్ వేసి ఆ కాపీని వారికి అందజేయాలని ఆదేశించినప్పటికీ ఎమ్మెల్యే ఆదేశాలను బేఖాతరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



దివ్యాంగుల దగ్గరకు వచ్చి వారి సమస్యను తెలుసుకుంటున్న ఆర్డీవో